ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్

- జయగిరిలో కాంటాలో మోసాన్ని గుర్తించిన రైతులు
- కేంద్రం నిర్వాహకులతో వాగ్వాదం
- అధికారుల పర్యవేక్షణ లోపంతో అన్నదాతలకు అన్యాయం


నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న రైతులు


ఏపీఎంను ప్రశ్నిస్తున్న అన్నదాతలు

హసన్‌పర్తి: ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు అభాసు పాలవుతున్నాయి. ధాన్యం కొనుగోలులో గోల్‌మాల్ చేస్తూ రైతులను నిర్వాహకులు మోసం చేస్తున్నారు. హసన్‌పర్తి మండలం జయగిరిలో శుక్రవారం ఈసంఘటన వెలుగు చూసింది. దీంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు.

పది కిలోలలకు తొమ్మిన్నర కిలోలే..

ప్రస్తుత సీజన్‌లో హసన్‌పర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. జయగిరిలో మణికంఠ మహిళా పొదుపు సంఘానికి కొనుగోలు బాధ్యతను అప్పగించారు. వారం రోజుల క్రితమే ప్రారంభమై నాలుగు లారీల ధాన్యాన్ని సేకరించారు. శుక్రవారం ధాన్యం తూకం వేస్తున్న క్రమంలో ఓ రైతుకు అనుమానం వచ్చింది. వెంటనే ఎలక్ట్రానిక్ కాంటాను తీసుకొచ్చి బరువు తూచాడు. నిర్వాహకుల వద్ద ఉన్న కాంటాలో తేడా ఉన్నట్లు గుర్తించాడు. పది కిలోలకు అర కిలో తేడా ఉన్నట్లు కనిపించింది. దీంతో నిర్వాహకులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఏపీఎం ప్రభాకర్‌తో పాటు పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అయితే, కాంటా పనిచేయకపోవడంతో మరమ్మతు చేశామని నిర్వాహకులు చెప్పారు. అందుకు రైతులు అంగీకరించలేదు. మొదటి నుంచే కాంటాలో మోసం జరుగుతూ వస్తోందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా సేకరించిన ధాన్యంలో కాంటాలో గోల్‌మాల్ జరిగినట్లు రైతులు ఆరోపించారు. కాగా, ఈమేరకు ఏపీఎం ప్రభాకర్‌ను ప్రశ్నించగా, అధికారుల అనుమతి లేకుండా ఎలక్ట్రానిక్ మిషన్ సీల్ ఓపెన్ చేయడం నేరంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటన విచారిస్తున్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి


బైక్ ర్యాలీలో వినయ్‌భాస్కర్, నాయకులు

రామన్నపేట: ఈనెల 27న జరగనున్న బీఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ కోరారు. ఈమేరకు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. భద్రకాళి టెంపుల్ నుంచి 29 డివిజన్‌లోని బొడ్రాయి వద్దకు ర్యాలీగా వెళ్లి అక్కడ పూజలు చేసి పాపయ్యపేట పెద్ద మోరీ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రామన్నపేట, బెస్త సంఘం, రఘునాథ్ కాలనీ, పాపయ్యపేట ఓఎస్ నగర్, రంగంపేట వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వద్దిరాజు గణేష్, 29 డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, ఎండీ షఫీ, రాచర్ల రాము, గట్టు చందు, తాళ్లపల్లి రమేష్, పూజారి కుమారస్వామి, ఇజ్జగిరి భీమరాజ్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా రజతోత్సవ సభకు..

హన్మకొండ చౌరస్తా: ఎల్కతుర్తిలో ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు హనుమకొండలోని 10వ డివిజన్‌కు చెందిన ఎండీ.ఖలీల్, అహ్మద్, యాకూబ్‌పాషా శుక్రవారం పాదయాత్రగా తరలివెళ్లారు. ముందుగా సుబేదారిలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు.

వరంగల్ నగరానికి మీరేం చేశారు?


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

నయీంనగర్: వరంగల్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారో చెప్పాలని, ప్రత్యేక అభిమానం అనే మాట బూటకమని, వరంగల్ ప్రజలను మభ్యపెట్టి వాడుకొని వదిలేయడమే కేసీఆర్‌కు అలవాటని ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ ప్రజలు వద్దంటున్నా వినకుండా హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏర్పాటుచేసి నగర ఐక్యతకు తూట్లు పొడిచారని ఎద్దేవాచేశారు. తెలంగాణకు వరంగల్ గుండెకాయ వంటిందని, కుట్రపూరితంగా వరంగల్‌ను ముక్కలు చేశారని వాపోయారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ నగరాలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని వరంగల్‌కు ఇవ్వలేదని, వరంగల్‌పై ప్రత్యేక అభిమానం ఉత్త బూటకమని ఆరోపించారు. వరంగల్‌ను తమ రాజకీయ ఉన్నతికి, స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవద్దని కేసీఆర్‌కు సూచించారు. కార్యక్రమంలో పాపిరెడ్డి, యాదగిరి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వడ్డేపల్లి చర్చి కూడలి, ఎన్జీఓస్ కాలనీ కూడలి, రాఘవేంద్రనగర్, స్నేహనగర్, భవానినగర్, సూర్య ఆస్పత్రి, వడ్డేపల్లి, టీచర్స్ కాలనీ -2, విజయ్‌పాల్ కాలనీ, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, ప్రశాంత్ నగర్ ప్రాంతాల్లో ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.కోటితో సుర్జీత్‌నగర్ అభివృద్ధి



కాజీపేట అర్బన్: పశ్చిమ నియోజకవర్గ పరిధి 31వ డివిజన్‌లోని సుర్జీత్‌నగర్‌ను కోటి రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్‌లో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులు 70 లక్షలతో పాటు మరో రూ.30 లక్షల నిధులు కేటాయించి సుర్జీత్‌నగర్‌ను అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



కాజీపేట: కాజీపేట విష్ణుపురి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సోమిడి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు స్నాతకోత్సవ దుస్తులు ధరించి హాజరై టీచర్ తేరాజ నుంచి పట్టాలు స్వీకరించారు. అనంతరం చిన్నపిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు ఆయా గీత కుమారి పాల్గొన్నారు.

ముష్కరుల దాడి హేయం



హన్మకొండ: జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులను ఉగ్ర ముష్కరులు హతమార్చడం దారుణమని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత వాపోయారు. ఈమేరకు హనుమకొండ రాంనగర్‌లోని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంతాప సమావేశంలో పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పహల్గాం దాడిని తీవ్రంగా ఖండించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ దామోదర్, మల్యాల మనోహర్ రావు, అడ్వకేట్ రొండ్ల భాస్కర్ రెడ్డి, సాంబరావు, సర్వోదయ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, సిబ్బంది ఇందిర, సతీష్, జోత్స్న, అక్తర్, వనిత, మంజుల పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా జీవించాలి



కాజీపేట: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులను పొట్టన బెట్టుకున్న తీవ్రవాదులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. కాజీపేట 63వ డివిజన్ ఏఆర్ఆర్‌నగర్ కాలనీలో పార్టీ మండల శాఖ మహాసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలు మతాలకు అతీతంగా జీవించే స్వేచ్చను కల్పించాలని కోరారు. సమావేశానికి రాసమల్ల దీన అధ్యక్షత వహించగా, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల కుమార్, సుదర్శన కుడిస్వామి, స్వరూప, సాల్మన్ పాల్గొన్నారు.

కిట్స్‌తో అవగాహన ఒప్పందం



హసన్‌పర్తి: కిట్స్, వరంగల్ - హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎస్ఐసీకి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈమేరకు హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కిట్స్ ఇంటర్న్‌షిప్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ రఘోత్తంరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, ఎస్ఎస్ఐసీ జీఎం అండ్ సెంటర్ హెడ్ సుబ్రహ్మణ్యం.. ఒప్పందంపై సంతకాలు చేశారని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం వల్ల ప్రత్యక్ష ప్రాజెక్టులను రూపొందించడం, పరిశోధకులు, విద్యార్థుల ప్రయోజనం కోసం అద్భుతమైన అవకాశమని అశోక్‌రెడ్డి తెలిపారు.

పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం


మాట్లాడుతున్న నర్సింహారావు

కేయూ క్యాంపస్: సామాజిక శాస్త్రాల పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తుందని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ నర్సింహారావు తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మానవ వనరుల విభాగం పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై నిర్వహిస్తున్న తరగతుల్లో భాగంగా ఆయన శుక్రవారం హాజరై మాట్లాడారు. మెథడ్స్ ఆఫ్ డాటా అనే అంశంపై మాట్లాడుతూ పరిశోధకులు అబ్జర్వేషన్, ఇంటర్వ్యూలు, ప్రశ్నావళి, అనే వివిధ రకాల పద్ధతుల ద్వారా డాటాను సేకరించాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుత తరుణంలో సామాజిక శాస్త్ర పరిశోధనలో విషయ పరిజ్ఞానాన్ని ఒక క్రమపద్ధతిలో క్రోడీకరించేందుకు ఇంటర్నెట్, సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్బిట్రేషన్ పూర్తి



వరంగల్: గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఆర్బిట్రేషన్ పూర్తయిందని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన గీసుకొండ మండలం బొడ్డుచింతలపల్లి గ్రామ రైతులతో కలెక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్బిట్రేషన్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

వసంతోత్సవాలను విజయవంతం చేయాలి


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాజీపేట: శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో జరగనున్న 27వ వసంతోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ కోరారు. కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి ఆలయంలో భక్తులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 2న స్వామివారి పుట్టిన రోజును పురస్కరించుకుని కనులపండువగా సాగే వసంత ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈనెల 30 నుంచి మే 4వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. ఉత్సవాలకు అన్ని సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందని గుర్తుచేశారు. సమావేశంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు శర్మ, వైదిక కార్యక్రమాల నిర్వాహకులు సాయికృష్ణశర్మ, దేవులపల్లి సదానందం, తుమ్మ శ్రీనివాస్, సరిత, అర్చకులు పాల్గొన్నారు.

పైడిపల్లిలో స్థలం కబ్జాకు యత్నాలు


మాట్లాడుతున్న కాలనీ వాసులు

వరంగల్: నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లిలోని శ్రీరాఘవేంద్ర ఆర్టీసీ కాలనీకి చెందిన కమ్యూనిటీ హాల్, శిశు మందిర్‌కు కేటాయించిన 650గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని కాలనీ అధ్యక్షుడు పిన్నింటి ప్రకాశ్‌రావు ఆరోపించారు. కమ్యూనిటీ హాల్ స్థలం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1980లో అప్పటి ఏపీఎస్ఆర్టీసీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (67/టీటీ) సర్వే నంబర్ 1243, 262, 263లలో 7ఎకరాల 7గుంటలు కొనుగోలు చేసి, అందులో 650గజాలను కమ్యూనిటీ హాల్, శిశు మందిర్ నిర్మాణం కోసం కేటాయించి మిగిలిన స్థలంలో 83 ప్లాట్లు చేసినట్లు తెలిపారు. కమ్యూనిటీ హాల్, శిశుమందిర్ కోసం ఖాళీగా ఉన్న స్థలంలో కబ్జాదారుడు గృహ నిర్మాణం కోసం మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కబ్జాదారులపై ఏనుమాముల పోలీసుస్టేషన్‌లో గత డిసెంబర్ 30న ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. సమావేశంలో గణపతిరావు, మామిడిపల్లి చిరంజీవి, నర్సింగరావు, కాంతారావు, రాయబారపు రాములు, నిర్మల, సుభద్రదేవి, లక్ష్మి, లత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

దివంగత జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలి



నయీంనగర్: వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆదుకోవాలని దివంగత జర్నలిస్టుల ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో దివంగత ఎం.సుధాకర్ రావు ప్రాంగణంలో క్యాతం విజయ అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ నాయకుడు దాసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సమంత కుమారి, దేవకి, మానస, తబసమ్, విజయ, రజిత, రమ, రాజేశ్వరి, సుమలత, వసుమతి, తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఎంట్రెన్స్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, కేడీసీ అధ్యాపకులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంకామ్ కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ ఫ్రీ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ కోచింగ్‌ను త్వరలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. ఈమేరకు సంబంధించిన పోస్టర్‌ను కాకతీయ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు శుక్రవారం ఆవిష్కరించారు. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలతో కలిసి మే 26వ తేదీ నుంచి ఆన్‌లైన్ ఫ్రీ కోచింగ్ నిర్వహించనున్నట్లు రాజారెడ్డి వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు 99892 92372 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీ కామర్స్ అధ్యాపకులు రాజశేఖర్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, మహ్మద్ యాకూబ్, చిన్నా, జికె.కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'డైట్' పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

విద్యారణ్యపురి: నాలుగు దశాబ్దాల క్రితం హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ కోర్సు పూర్తిచేసిన 1984 - 1985వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండలోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా ఒకచోటకు చేరి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ అదనపు ఎస్పీ విద్యాసాగర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దాసు కుమారస్వామి, ఎం.రవీందర్, సాయిబాబా, సైమన్బాయ్, రాజ్‌మహ్మద్, షద్రక, ఉమ, శోభ, మాధవి పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడితో ఉత్తమ జీవితం


వివరాలు వెల్లడిస్తున్న అరుణ్‌కుమార్

ఖిలా వరంగల్: అధునాతన శస్త్ర చికిత్స ద్వారా కిడ్నీ మార్పిడి చేస్తే ఉత్తమమైన జీవితాన్ని తిరిగి అందుకోవచ్చని యశోద ఆస్పత్రి సోమాజీగూడ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్ర చికిత్స నిపుణుడు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ పొన్న అరుణ్‌కుమార్ అన్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతానికి మనుషుల్లో ధైర్యం, స్ఫూర్తి, ప్రేమ అవసరమని పేర్కొన్నారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని పల్లవి ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్ర ఊబకాయం, రెండు కాళ్లకు పక్షవాతం, పల్మనరీ ట్యూబర్ కొలాసిస్, హైపటైటిస్ సీతో గ్రేడ్ సార్కోమా వంటి అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తికి యశోద ఆస్పత్రి వైద్య బృందం అధునాతన చికిత్స ద్వారా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పొన్నం దశరథం, యశోద ఆస్పత్రి పీఆర్ఓ రమేష్, కిడ్నీ మార్పిడి చేసుకున్న వెంకటేశ్వర్లు, పూజిత పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి


పబ్లిక్‌గార్డెన్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే నాయిని, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ


హనుమకొండ చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


హనుమకొండ కాళోజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు


దర్గాలో సంతాపం తెలుపుతున్న దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా, ముస్లింలు


ప్రకాశ్‌రెడ్డిపేటలోని కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న లోటస్‌కాలనీ వాసులు


శివనగర్‌లో నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

సంక్షిప్తంగా

మొబైల్ కోర్టులు ఏర్పాటు చేయాలి

వరంగల్: భూముల రిజిస్ట్రేషన్, హక్కుల విషయంలో నెలకొన్న వివాదాలను పరిష్కరించేందుకు డివిజన్ల స్థాయిలో మొబైల్ కోర్టులు ఏర్పాటు చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అబ్బనికుంటలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ధరణిలోని వివాదాస్పదమైన అంశాలను తొలగించి కొంత సరళంగా భూ భారతి చట్టాన్ని రూపొందించారని అన్నారు. అయితే ఇది భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవచ్చని అభిప్రాయపడ్డారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల కన్వీనర్ సోమ రామ్మూర్తి, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు మాచర్ల బాలరాజు, ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్, ఆర్ఎస్‌పీ జిల్లా నాయకులు వల్లందాస్ పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ లెక్క తేల్చాలి

గీసుకొండ: ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో మూడేళ్ల నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్న వారు రూ.35 లక్షల వరకు సొంతానికి వాడుకుని మోసం చేశారని అసోసియేషన్‌లోని ఓ వర్గం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం వారు గ్రేటర్ వరంగల్ గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలోని అసోసియేషన్ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాడుకున్న డబ్బులను అసోసియేషన్‌లో జమ చేసిన వారికే లారీల బుకింగ్ సీరియల్ కేటాయిస్తామని స్పష్టం చేశారు. అసోసియేషన్ గౌడవతో కొండా దంపతులకు ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. అసోసియేషన్ నాయకులు ఎండీ షకీల్ అహ్మద్, వేముల శ్రీకాంత్, శనిగరం శ్రీహరి, నాయబ్, శంకర్, బి.నారాయణ, ఎండీ కుతుబ్, టి.రాకేశ్, అజీమ్ పాల్గొన్నారు.

కళలపై అవగాహన కలుగుతుంది

హన్మకొండ కల్చరల్: శిక్షణ శిబిరాల కార్యక్రమాల ద్వారా కళలపై అవగాహన కలుగుతుందని ఎంజీఎం ఆస్పత్రి న్యూరోసర్జన్, రిటైర్డ్ ఆర్ఎంఓ డాక్టర్ బందెల మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి నాట్య కళా పరిచయం 45రోజుల శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. వరంగల్‌లోని రాంనాథ్‌పురి కాలనీలోని పేరిణి నృత్యాలయంలో అకాడమీ నాట్యాచార్యుడు గజ్జెల రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మోహన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని నటరాజ స్వామిని పూలతో అలంకరించి జ్యోతిప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల అధినేత ఆడెపు వెంకటేశ్వర్లు, పేరిణి అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ, అకాడమీ అధ్యక్షురాలు మోతుకూరి చంద్రకళ, మృదంగ కళాకారులు బరాడి విజయ్, శ్రీజ, వైష్ణవి, గురుదేవ్, సంతోష్, తేజస్విని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ సాయి శివానికి అభినందన

ఖిలా వరంగల్: సివిల్స్ జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించిన వరంగల్ శివనగర్‌కు చెందిన సాయి శివానిని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్, బీజేపీ నాయకుడు శ్యామ్, శామంతుల శ్రీనివాస్ శుక్రవారం వేర్వేరుగా కలిసి అభినందించారు.

కార్మికుల హక్కుల రక్షణకు పోరాటం

ఖిలా వరంగల్: మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల రక్షణకు పోరాడుదామని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మేడే దినోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 139వ మేడే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మే 1న కార్మికులు మేడే జెండాలు ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో కందిక చెన్న కేశవులు, దండు లక్ష్మణ్, యాకోబ్, గోవర్ధన్, రమేష్, ఉప్పల రవి పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితం.. సంతృప్తినిచ్చింది

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఉద్యోగ జీవితం.. తనకెంతో సంతృప్తినిచ్చిందని, ఈక్రమంలో యూనివర్సిటీకి రుణపడి ఉంటానని కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య అన్నారు. ఈనెలాఖరున రాజయ్య ఉద్యోగ విరమణ పొందబోతున్నారు. ఈమేరకు కేయూ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజయ్యను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో కేయూ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సుజాత, జనరల్ సెక్రటరీ హబీబుద్దీన్, వివిధ విభాగాల అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ కోల శంకర్, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, నర్సింహారావు, ఎల్.రాము, శ్రీలత, వెంకటేశ్వర్లు, ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యతోపాటు జాతీయభావం పెంచుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు విద్యతోపాటు జాతీయ భావం కూడా పెంపొందించుకోవాలని ఏబీవీపీ ప్రాంత ప్రముఖ్ మాసాడి బాపురావు అన్నారు. ఏబీవీపీ, సామ జగన్‌మోహన్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ ఉచిత శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సామాజిక సమస్యలపై ఏబీవీపీ పోరాడుతోందని గుర్తుచేశారు. హనుమకొండ సీఐ సతీష్ డాక్టర్ భగీరథ్, వరంగల్ విభాగ్ ఏలేటి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంట హర్షవర్ధన్, ప్రాంత కార్యసమితి సభ్యులు ఆరెపెల్లి సుజిత్, బాధ్యులు సుధాకర్, ఉపాధ్యాయులు శ్రీదేవి, రోహిణి, సంజీవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బొగ్గారపు రామకృష్ణ, ఇతర దాతల ఆధ్వర్యంలో 15 మంది దివ్యాంగులకు శుక్రవారం వీల్ చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అజీమ్, చక్రపాణి, సంపత్, సతీష్, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై చర్య తీసుకోవాలి

హసన్‌పర్తి: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు రాజేష్ నాయక్‌పై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఫిర్యాదు పత్రాన్ని ఎస్సై రవీందర్‌కు అందించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, గడ్డం శివరాం, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

కాజీపేట రూరల్: విధి నిర్వహణలో ఎండదెబ్బ తగలకుండా రైల్వే కార్మికులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని డీజిల్ కాలనీ రైల్వే ఆస్పత్రి వైద్యుడు ధీరజ్‌కుమార్ సూచించారు. డీజిల్ లోకోషెడ్‌లో రైల్వే కార్మికులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండ వేడిని తట్టుకునే దుస్తులు ధరించాలని, తరుచూ తాగునీరు తీసుకోవాలని, ఆహార విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. అనంతరం రైల్వే కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

జీఓ 21లో మార్పులు చేయాలి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ 21లో మార్పులు, చేర్పులు చేయాలని పోస్ట్ డాక్టరల్ ఫెల్లోషిప్ అసోసియేషన్ కేయూ బాధ్యులు కోరారు. ఈమేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డాక్టరల్ ఫెల్లోషిప్ కలిగిన వారికి 10 మార్కులు కేటాయించాలని, యూజీసీ నిబంధనలను పరిగణలోనికి తీసుకోవాలని కోరారు.